క్లుప్తంగా

26న హుండీ లెక్కింపు

తాడేపల్లి రూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థాన హుండీ లెక్కింపు ఈనెల 26న నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డీసీహెచ్ వెంకటరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆసక్తిగల భక్తులు లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు.

విజయకీలాద్రిపై జ్యేష్ఠాభిషేకం



తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై శుక్రవారం జ్యేష్ఠాభిషేక మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన జీయర్‌స్వామి మంగళాశాసనములతో జ్యేష్ఠమాసం, జ్యేష్ఠ నక్షత్రం సందర్భంగా శ్రీ వెంకటేశ్వరస్వామికి ఉదయం 9 గంటలకు జ్యేష్ఠాభిషేకం నిర్వహించామని తెలిపారు. పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో స్వామి వారికి అభిషేకం చేశామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విజయకీలాద్రి వేద పండితులు, జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వేద విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి రూరల్: మంగళగిరి రూరల్ పరిధిలోని నిడమర్రు గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ లైన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిడమర్రు గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులకు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన



పెదకాకాని: విద్యావంతులైన బాలల వల్ల మెరుగైన సమాజం ఏర్పడుతుందని గ్రామ సర్పంచి ఆలా సాంబశివరావు అన్నారు. మండల పరిధిలోని కొప్పురావూరు గ్రామంలో శుక్రవారం చైల్డ్ రైట్స్ అడ్వొకేసీ ఫౌండేషన్ - క్రాఫ్ ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక మాసాన్ని పురస్కరించుకొని బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ఆడియో ప్రకటన ద్వారా అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా బాలలను బాగా చదివించాలని, తల్లిదండ్రులకు బాలలందరినీ స్కూలుకి పంపించే విధంగా అవగాహన కల్పించాలని బాలల హక్కుల చట్టాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్ జి.వెంకట్ మాట్లాడుతూ బాల కార్మికత్వాన్ని అంతం చేయడం అందరి బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. 14 - 18 సంవత్సరాల మధ్య ఉన్న బాలలను ప్రమాదకరమైన సంస్థలో నియమించటం నిషేధించబడిందని తెలిపారు. ఈ సమావేశంలో హైస్కూల్ హెచ్‌ఎం డీవి ప్రభాకర్, అంగన్వాడి వర్కర్లు కోటేశ్వరమ్మ, నాగలక్ష్మి, ఆశ వర్కర్లు గ్రామ పెద్దలు, బాలల పంచాయతీ బాలలు పాల్గొన్నారు.

క్రీడాకారుడు మొహిద్దీన్‌కు ఆర్థిక సాయం

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఛండీగఢ్‌లోని పంచకులలో ఈ నెల 25 నుంచి జరగనున్న జాతీయ అంతర్ రాష్ట్రాల అథ్లెటిక్ పోటీల్లో పాల్గొనే షేక్ మొహిద్దీన్‌కు సహస్ర ఆర్థో అండ్ న్యూరో క్లినిక్ అధినేత డాక్టర్ ఎం.శివకుమార్ ఆర్థిక చేయూత నందించారని అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జీవిఎస్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొహిద్దీన్ ఇటీవల ఫెడరేషన్ కప్‌లో కాంస్య పతకం సాధించడంతో జాతీయ పోటీలకు ఎంపికయ్యాడన్నారు. డాక్టర్ శివకుమార్ క్రీడాకారులకు ఎప్పుడూ అండగా నిలుస్తున్నారని తెలిపారు.

రేపు కామన్ సివిల్ కోడ్‌పై సదస్సు

నగరంపాలెం: సమాలోచన (మేధావుల వేదిక) గుంటూరు ఆధ్వర్యంలో ఈనెల 23న అమరావతి రోడ్డులోని హిందూ కళాశాల ఆఫ్ ఫార్మసీ సమావేశ మందిరంలో 'కామన్ సివిల్ కోడ్' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు అన్నా నందకిశోర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు రాక లోకం చీఫ్ ఎడిటర్ రాక సుధాకరరావు ముఖ్య వక్తగా వ్యవహరిస్తారన్నారు.

యోగాతో ఆరోగ్య భాగ్యం



యోగా చేస్తున్న ఎఫ్‌సీఐ సిబ్బంది

తాడేపల్లి రూరల్: యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి కృష్ణా కెనాల్ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. తాడేపల్లి ఎఫ్‌సీఐ మేనేజర్ ధనుంజయ్ వర్గీస్ మాట్లాడుతూ యోగాసనాల ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడంతోపాటు మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చని వివరించారు. దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని కోరారు. మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ చొరవతో యోగా దినోత్సవం జరుపుకొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో తాడేపల్లి కృష్ణా కెనాల్ ఎఫ్‌సీఐ మేనేజర్ క్యాసి శశికళ, దీప్, యోగా టీచర్ వెంకట్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఎన్‌సీసీ 10 ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ తరపున ప్రముఖ యోగా శిక్షకురాలు సుమ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా సర్వరోగ నివారిణి అన్నారు. భారతీయ సంస్కృతి, మేధాశక్తిని ప్రపంచానికి యోగా చాటి చెబుతోందని అన్నారు. యోగా నిత్యం చేయడం ద్వారా శరీరంలోని అన్ని భాగాలకు ఆక్సిజన్ అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండెంట్ కల్నల్ సిఎస్ సిద్ధు, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్‌వీఎస్ సుదర్శన్, కేఎల్‌యూ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథివర్మ, ప్రొ వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, ఎన్. వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె. హరికిషోర్, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ పావని తదితరులు పాల్గొన్నారు.

యోగా ప్రయోజనాలపై అవగాహన

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామంలో యోగా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కోటిలింగాల క్షేత్రం వద్ద ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులకు యోగాసనాలు వేసే విధానం , దానివల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి మున్నంగి శివకుమారి, కార్యదర్శి రాధాకృష్ణమూర్తి, హెచ్‌ఎం డి. కమల్‌మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

✦ ఫిరంగిపురం గ్రామంలోని కోదండ రామాలయంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. యోగా గురువు కేశవరెడ్డి యోగాసనాలు వేయడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో విశ్వనాథుని హరిబాబు, రావూరి నారాయణ, జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నిత్య సాధనతో రుగ్మతలు దూరం

తుళ్ళూరు ఎంపీడీవో బి.శ్రీనివాసరావు



పెదపరిమిలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో, టీడీపీ నాయకులు

పెదపరిమి (తాడికొండ): నిత్యం యోగా సాధన ద్వారా మానసిక, శారీరక రుగ్మతలను దూరం చేసుకోవచ్చని తుళ్ళూరు ఎంపీడీవో బి. శ్రీనివాసరావు సూచించారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని పెదపరిమి చెరువు ఒడ్డున మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యోగాను దినచర్యగా పాటించాలని సూచించారు. మాజీ యార్డు చైర్మన్ నూతలపాటి రామారావు, పుట్టి రామచంద్రరావు, నూతలపాటి రామచంద్రరావు, నరసయ్య, తదితరులు చెరువు పక్కన మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించి, యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు. హరిశ్చంద్రపురం గ్రామంలో టీడీపీ నాయకులు కొమ్మినేని కోటేశ్వరరావు, సత్యన్నారాయణ, కార్యదర్శి పలువురు అధికారులు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.

ఆసనాలతో ఆకట్టుకున్న విద్యార్థులు

మంగళగిరి: నగరంలో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు కళాశాలలు, పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆత్మకూరు నిర్మల పాఠశాలలో విద్యార్థులు యోగా విన్యాసాలతో ఆకట్టుకున్నారు. వెంకటేశ్వర యోగా చారిటబుల్ కేంద్రంలో పలువురు ఆసనాలు వేసి వేడుకలలో పాల్గొన్నారు.



నిర్మలా పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



సుమను సత్కరిస్తున్న కేఎల్‌యూ అసోసియేషన్ డీన్ డాక్టర్ కె. హరికిషోర్

ఘనంగా ఏరువాక పౌర్ణమి పండుగ



పొలంలో అరక దున్నుతున్న రైతు సంఘం నాయకులు

తాడికొండ: ఏరువాక పౌర్ణమి పండుగను పురస్కరించుకొని తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలో రైతు సంఘం, బడేపురం భవానీ పీఠం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద పొంగళ్ళు పెట్టారు. మేడిపట్టి అరక దున్ని పొలాల్లో నవధాన్యాలు చల్లారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి రైతుల ఇళ్లు ధనధాన్యాలతో కళకళలాడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, నియోజక వర్గ కార్యదర్శి ముప్పాళ శివ శంకరరావు, గ్రామ కార్యదర్శి రామినేని రామారావు, నాయకులు చింతల భాస్కరరావు, రేపూడి శ్రీనివాసరావు, భవానీ పీఠం వ్యవస్థాపకులు కొల్లిపర నాగకోటేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ట్రాన్స్‌జెండర్స్‌కు ప్రత్యేక ఓపీ

గుంటూరు మెడికల్: సమాజంలో మంచి గుర్తింపు వచ్చే విధంగా ట్రాన్స్‌జెండర్స్ మసలుకోవాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ సూచించారు. జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ప్రైడ్ మంత్‌లో భాగంగా వాలంటరీ హెల్త్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ట్రాన్స్‌జెండర్స్‌కు ఉచిత వైద్య సలహాలతో పాటు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ జీజీహెచ్‌లో ట్రాన్స్‌జెండర్స్‌కు ప్రత్యేకమైన ఓపీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం ట్రాన్స్‌జెండర్స్‌తో కలసి సూపరింటెండెంట్ కేక్ కట్ చేశారు.

'జూన్' ఖర్చులు.. మధ్యతరగతి గుండె గుబేలు!

- పిల్లల చదువు కోసం తల్లిదండ్రులకు తప్పని భారం
- పెరిగిన నిత్యావసర, కూరగాయల ధరలతో బెంబేలు
- ఖరీఫ్ సాగు పెట్టుబడి కోసం అన్నదాతల పాట్లు
- చాలా కుటుంబాలపై ఈ నెలలో తీవ్ర ప్రభావం



చిన్నారులకు బూట్లు కొనుగోలు చేస్తున్న తల్లిదండ్రులు



స్కూల్ బ్యాగులు కొంటున్న దృశ్యం

పొన్నూరు : జూన్ నెల పేరు చెబితే మధ్యతరగతి కుటుంబాల గుండెల్లో రైళ్లు పరుగెడుతుంటాయి. బడ్జెట్ లెక్క ఒక పట్టాన తేలదు. వేతనంపైనే ఆధార పడిన వారు, సామాన్య మధ్యతరగతి కుటుంబాలకు ఈ నెల ఒక పరీక్షా సమయమనే చెప్పాలి. ఏడాది మొత్తంలో ఆదా చేసిన సొమ్ము కాస్తా ఈ నెలలో హరించుకుపోతుంది. తప్పనిసరి అవసరాలు, తప్పించుకోలేని ఖర్చులతో ఉక్కిరిబిక్కిరి అయ్యే మధ్యతరగతి కుటుంబాలకు ఈ నెల గడపడం పెద్ద సవాల్‌గా మారింది.

విద్యాసంస్థల ఫీజుల మోత..

జూన్ రెండో వారం నుంచి పాఠశాలల్లో తరగతులు, ప్రవేశాలు మొదలయ్యాయి. దీంతో పిల్లల ఫీజులు చెల్లించడం, దుస్తులు, పుస్తకాల కొనుగోలుకు తల్లిదండ్రులు రూ. వేలల్లో వెచ్చించాల్సి వస్తోంది. పిల్లల భవిష్యత్తు కోసమే కదా.. మనం ఇంతగా కష్టపడుతున్నదని చెప్పుకొనే సగటు తల్లిదండ్రులకు ఈ ఫీజుల భారం మోయలేనంతగా మారిపోయింది. దిగువ మధ్యతరగతి, పేద వర్గాలు సైతం తమ పిల్లల్ని ప్రైవేటు బడులకు పంపేందుకే మొగ్గు చూపుతున్నారు. పుస్తకాలు, బ్యాగులు, క్యారేజ్ బ్యాగులు, బూట్లు వంటివి సిద్ధం చేయాలి. వీటిలో ఏ ఒక్కదానికి మినహాయింపు ఉండదు. దీంతో ఒక్కో విద్యార్థికి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. పొన్నూరు మండలంలో మొత్తం మొత్తం 29 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి.

విద్యా సామగ్రిపై ధరాఘాతం...

ఈ సంవత్సరం విద్యాలయాల్లో ప్రవేశ రుసుములు తల్లిదండ్రులకు భారంగా మారుతున్నాయి. ప్రస్తుతం విద్యారంగంలో నెలకొన్న పోటీ కారణంగా పిల్లలను బాగా చదివించాలన్న కోరిక తల్లిదండ్రుల్లో నెలకొంది. మంచి పాఠశాలను ఎంపిక చేసుకోవడం దగ్గర నుంచి పిల్లలను పాఠశాలకు పంపించేందుకు రవాణా సదుపాయం, ఇతర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో సగటు జీవిపై ఇది ఆర్థిక భారం పెంచుతోంది.

బెదరగొడుతున్న ధరలు..

మండే ఎండలు కూరగాయల సాగుపై తీవ్ర ప్రభావం చూపడంతో వాటి ధరలు విపరీతంగా పెరిగాయి. వాటితోపాటు నిత్యావసరాల ధరలు కూడా పెరిగి ప్రజలపై భారం పడింది. ప్రస్తుతం కూరగాయలు ఏవైనా రూ. 50కి పైమాటే. కందిపప్పు, మంచి నూనె, మాంసాహారం ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. టమాటా ధర కిలో రూ. 70 ఉంటే, కిలో కోడి మాంసం రూ.280కి చేరువైంది. మార్కెట్‌కు వెళుతుంటే కూరగాయల సంచి నిండడం లేదు గాని జేబులు మాత్రం ఖాళీ అవుతున్నాయని సామాన్యులు వాపోతున్నారు. రాబడికి తగ్గట్టుగా జూన్ నెల ఖర్చులకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని నిపుణులు తెలుపుతున్నారు.

పంటల సాగుకు పెట్టుబడులు..

రైతులు ఖరీఫ్ సాగు పనులు ఈ నెలలో ప్రారంభించారు. పెట్టుబడులు సమకూర్చుకునేందుకు అప్పుల కోసం బ్యాంకులు, వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. విత్తనాలు, ఎరువుల ధరలు ఈ సంవత్సరం బాగా పెరగడంతో పెట్టుబడులు ఎక్కువ పెరిగే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సుమారు 30 వేల ఎకరాల్లో సాగు చేసేందుకు అన్నదాతలు సమాయత్తమయ్యారు.

ఆపరేషన్‌తో పనిలేకుండా మందులతోనే చికిత్స



చికిత్స చేయించుకున్న నరసింహారావుతో డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ అందె కోటి వెంకటేశ్వరరావు

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్యులు ఆపరేషన్ చేయకుండానే మందులతోనే రోగికి ఉపశమనం కలిగించారని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. వైద్యం గురించి శుక్రవారం ఆయన వివరించారు. కృష్ణాజిల్లా గన్నవరానికి చెందిన పి.నరసింహారావు గత నెల 23న ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధితో అత్యవసర విభాగానికి వచ్చాడు. తీవ్రమైన దగ్గు, ఆయాసం, గుండె నొప్పి, గుండె మంటతో బాధ పడుతున్నాడు. అతిగా మద్యం అలవాటుతో తరచుగా వాంతులతో అన్నవాహికలో చీలిక వచ్చింది. ఇది ఊపిరితిత్తుల్లోకి వెళ్లిందని సూపరింటెండెంట్ కిరణ్ కుమార్ వివరించారు. ప్రైవేటు వైద్యులు ఆపరేషన్ చేయాలని, చాలా ఖర్చు అవుతుందని చెప్పడంతో రోగి జీజీహెచ్‌కు వచ్చాడన్నారు. ఎలాంటి ఆపరేషన్ లేకుండానే ఎండోస్కోపి ద్వారా వైద్యం అందించి మందులతో వ్యాధిని నయం చేశామని తెలిపారు. వెంటిలేటర్‌పై ఉన్న పేషంట్‌కు వైద్యులు సమయస్ఫూర్తితో వ్యవహరించి సకాలంలో వైద్యం అందించి ఉపశమనం కలిగించారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యుల్ని అభినందించారు.

శ్రీవారికి చందన అలంకారం



నగరంపాలెం: స్థానిక లాలాపేటలోని శ్రీ పద్మావతి ఆండాళ్ సమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ఐదో రోజుకి చేరాయి. శ్రీ స్వామి వారికి చందనం (గంధంతో) అలంకారం చేశారు. ఉదయం నిత్య హోమం, బలిహరణ, గరుడ వాహనంపై గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. 108 కలశాలతో అష్టోర కలశ స్నపన అభిషేకాలు జరిగాయి. రాత్రి పుర వీధుల్లో రథోత్సవం అట్టహాసంగా కొనసాగింది. మహిళల కోలాటం అలరించింది. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో శ్రీ జగన్నాథ, శ్రీ ఆంజనేయ, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానాల చైర్మన్ సూరినేడి దుర్గావరప్రసాద్, సహాయ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం అర్చకులు ఆర్.టి.ఆర్.వి.ప్రసాద్, శ్రీనివాసాచార్యులు, మురళీ, చంద్రకుమార్ పాల్గొన్నారు.

సచివాలయ సెక్రటరీలు అందుబాటులో ఉండాలి

కార్పొరేషన్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్



పట్టణంలో పర్యటిస్తున్న నిర్మల్ కుమార్

మంగళగిరి : సచివాలయ సెక్రటరీలు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కార్పొరేషన్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ అన్నారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. సచివాలయ సెక్రటరీలు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పారిశుద్ధ్య పనులతోపాటు తాగునీటి సమస్యలపై కూడా దృష్టి పెట్టి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి ఆయా వార్డుల్లో పర్యటిస్తూ పరిష్కరించాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది, అధికారులు ఉన్నారు.

మాతాశిశు మరణాలు అరికట్టేందుకు కృషి



రికార్డులు పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు

ఫిరంగిపురం: మాతాశిశు మరణాలు అరికట్టేందుకు ఆరోగ్యసిబ్బంది కృషి చేయాలని డీపీహెచ్ ఎన్‌వో కె. శాంతకుమారి అన్నారు. మండల కేంద్రంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను శుక్రవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు రక్తహీనత పరీక్షలు చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. తర్వాత శాంతకుమారి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గర్భిణులకు రక్తపరీక్షలు చేసి తగిన మందులు, ఆహారం తీసుకునేలా వారికి సలహాలు ఇస్తున్న తీరును పరిశీలించినట్లు తెలిపారు. జననీ సురక్షా యోజన, ప్రధాన మంత్రి మాతృ యోజన వంటి ప్రయోజనాలు అందిన తీరును తెలుసుకున్నట్లు చెప్పారు. అనంతరం సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థులకు రక్తనమూనా పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఆర్‌సీహెచ్ రిజిస్టర్లు, స్కూల్ హెల్త్ రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఏఎన్‌ఎంల వద్ద ఆర్‌సీహెచ్ ఐడీ, అంగన్‌వాడీ సెంటర్లలో గర్భిణులకు సంబంధించి ఐడీ నెంబర్లు పోల్చి చూశారు. కార్యక్రమంలో డీపీవో ఎన్‌హెచ్‌ఎం సైమన్‌రాజు, హెచ్‌వీ షేక్, ఎం. వహీద, టెక్నికల్ అసిస్టెంట్ షరీఫ్, వైద్యులు పి. ఎస్తేరురాణి, శ్వేత, సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌వో అమృతరాణి, ఏఎన్‌ఎంలు లావణ్య, భారతీజ్యోతి, మాబు, ఆంథోని రాణి, అరుణ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఆగని ఆక్రమణల పర్వం



హెచ్చరిక బోర్డు పెడుతున్న రెవెన్యూ, పంచాయతీ అధికారులు

లాం(తాడికొండ): ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసినా తాడికొండ మండలం లాం గ్రామంలో భూముల ఆక్రమణకు అడ్డుకట్ట పడిన దాఖలాలు కనిపించడం లేదు. కొండ పోరంబోకు, పలు ప్రభుత్వ భూములను గ్రామానికి చెందిన కొందరు ఇష్టారీతిగా ఆక్రమించి నకిలీ బీ ఫారం సర్టిఫికెట్లతో అమ్ముకొని రూ. కోట్లు సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్‌కు గ్రామస్తుల నుంచి పలు ఫిర్యాదులు వెళ్లాయి. గతంలో ఆయా అక్రమ నిర్మాణాలకు అధికారులు నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ అడ్డుకట్ట పడిన దాఖలాలు లేవు. మరికొంతమంది గుట్టుచప్పుడు కాకుండా రూ.లక్షల విలువైన భూములను ఆక్రమిస్తుండటంతో అధికారులు ఎట్టకేలకు హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే లాం గ్రామంలో కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతం అయిపోగా... మిగిలిన కొద్దిపాటి భూమి అయినా అధికారులు కాపాడుతారేమో చూడాలి. నీకింత.... నాకెంత అనే చందంగా సాగుతున్న ఈ వ్యవహారంలో ఇప్పటికే రెవెన్యూ శాఖకు చెందిన ఓ అధికారి నకిలీ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు నివేదిక పూర్తయినట్లు సమాచారం. అతనితోపాటు గుట్టు చప్పుడు కాకుండా చేతులు కలిపి అమ్ముకొని సొమ్ము చేసుకున్న కేటుగాళ్లపై ఎంతమేరకు చర్యలు తీసుకుంటారనేది అంతుబట్టని ప్రశ్నగా మారింది.

మహిళా పోలీసులకు న్యాయం చేయాలని వినతి



దమ్మాలపాటి శ్రీనివాస్‌కు అభినందనలు తెలుపుతున్న దుర్గం మధులత

తాడేపల్లి రూరల్: రాష్ట్రవ్యాప్తంగా సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న 15 వేల మంది మహిళా పోలీసులకు న్యాయం చేయాలని ఏపీ విలేజ్ వార్డ్ సెక్రటేరియట్ మహిళా పోలీస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు దుర్గం మధులత కోరారు. ఈ మేరకు శుక్రవారం హైకోర్టు అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్‌ను ఆయన కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. నూతనంగా నియమితులైన శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తమకు న్యాయం చేయాలని విన్నవించారు. మహిళా పోలీసులు ఎదుర్కొంటున్న కోర్టు కేసు విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనికి శ్రీనివాస్ సానుకూలంగా స్పందించారని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అమ్ముల రాధిక, గుంటూరు జిల్లా అడిషనల్ జనరల్ సెక్రటరీ తిరందాసు గీతా పావని తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్‌లో పూడిక తొలగించాలి

గుంటూరు జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి



నంబూరు వద్ద గుంటూరు ఛానల్‌ను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు కొల్లి రంగారెడ్డి, తదితరులు

పెదకాకాని: గుంటూరు ఛానల్‌లో తూటికాడ తొలగించాలని గుంటూరు జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం నంబూరు గ్రామం వద్ద గుంటూరు ఛానల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుంటూరు ఛానల్ (కొత్తకాలువ) 47 కిలోమీటర్లు పొడవు ఉందని, 1966 నుంచి వేల ఎకరాలకు సాగునీరు అందించిందన్నారు. ఈ కాలువను ప్రకాశం జిల్లా వరకు పొడిగించి సాగు, తాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ కాలువ కట్టలు తెగిపోయేలా తయారయ్యాయని, తుమ్మ చెట్లు పెరిగిపోయాయని, గుర్రపుడెక్క పెరిగిందన్నారు. ఇందులోని నీరు తాగితే రోగాల బారిన పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధ ప్రాతిపదికన కాలువ కట్ట పనులు చేయించి పూడిక తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా రైతులను సమీకరించి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, నంబూరు పార్టీ కార్యదర్శి కూసం నాగిరెడ్డి, వంగా లక్ష్మారెడ్డి, ఉయ్యూరు శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరావు, జొన్నల శ్రీనివాసరెడ్డి వెంకయ్య, పున్నయ్య, కొండయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

పట్నంబజారు: వృద్ధురాలి మెడలో గుర్తు తెలియని ఓ మహిళ గొలుసు లాక్కుని పరారైన సంఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. చౌత్రా సెంటర్‌కు చెందిన నీలిశెట్టి శేషారత్నం అనే వృద్ధురాలు శుక్రవారం మధ్యాహ్నం ఇంటి బయట కూర్చుని ఉన్నారు. ఈ సమయంలో గుర్తు తెలియని ఓ మహిళ అకస్మాత్తుగా శేషారత్నం వద్దకు వెళ్లి ఆమె మెడలోని గొలుసు లాక్కుని పరారైంది. బాధితురాలు లాలాపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు విచారిస్తున్నట్లు తెలిసింది.